# అమరుడి బిడ్డకు అండగా కేసీఆర్

- కానిస్టేబుల్ కిష్టయ్య బిడ్డకు ఆర్థికసాయం
- మెడిసిన్‌లో పీజీ చేస్తున్న ప్రియాంక
- రూ. 24 లక్షల చెక్ ఇచ్చిన కేసీఆర్
- కిష్టయ్య కుటుంబంతో కలిసి భోజనం
- కేసీఆర్‌కు కిష్టయ్య కుటుంబం కృతజ్ఞతలు

అమరుడు కిష్టయ్య కుటుంబసభ్యులతో కలిసి తన నివాసంలో భోజనం చేస్తున్న బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కానిస్టేబుల్ కిష్టయ్య ఆత్మార్పణ అజరామరఘట్టం. ఆయన ప్రాణత్యాగంతో ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబానికి తానున్నానని ఆనాడే మాట ఇచ్చిన కేసీఆర్ దానిని నిలుపుకొంటూ వస్తున్నారు. కిష్టయ్య మరణించే నాటికి ఆయన కొడుకు, కూతురు చిన్నపిల్లలు. వారి చదువు సహా ప్రతి కష్టకాలంలో కేసీఆర్ అండగా నిలిచారు. ఆ కుటుంబానికి గుండె ధైర్యమిస్తూ వారి బాగోగులు చూసుకుంటున్న కేసీఆర్, కిష్టయ్య బిడ్డ ప్రియాంక ఎంబీబీఎస్ చదువుకు అవసరమైన ఆర్థికసాయం అందించారు. తాజాగా ఎంబీబీఎస్ పూర్తిచేసిన ప్రియాంక ప్రస్తుతం పీజీ చదువుతున్నది. ఈ నేపథ్యంలో కాలేజీ ఫీజు నిమిత్తం రూ. 24 లక్షల ఫీజును ఆదివారం చెక్కు రూపంలో కేసీఆర్ ఆ కుటుంబానికి అందించారు. నందినగర్‌లోని తన ఇంటికి కిష్టయ్య కుటుంబాన్ని పిలిపించుకొని వారితో కలిసి భోజనం చేశారు. వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు.

### అమ్మకు కష్టం రాకుండా చూసుకోండి

'రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేస్తూ నాయిన చనిపోయినప్పుడు మీరు చిన్న పిల్లలు. కష్టకాలంలోనూ అమ్మ మిమ్మల్ని ఎంతో కష్టపడి చదివించింది. ఇప్పుడు మీరు ప్రయోజకులయ్యారు. అమ్మకు ఏ కష్టం రాకుండా చూసుకోవాలి. మీకు ఏ సమయంలోనైనా నా సహకారం ఉంటుంది' అని కేసీఆర్ భరోసా కల్పించి, వారి బాధ్యతలను గుర్తుచేశారు. ఈ సందర్భంగా తమ కుటుంబాన్ని ఇంటి పెద్దలా అదుకుంటున్న కేసీఆర్‌కు కిష్టయ్య కుటుంబం ధన్యవాదాలు తెలిపింది. తెలంగాణ కోసం త్యాగాలు చేసిన అమరులను తమ ప్రభుత్వంలో ఆదుకున్నామని, అదే స్ఫూర్తిని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని కేసీఆర్ సూచించారు.

### తండ్రిలా అండగా నిలిచారు: కిష్టయ్య భార్య

'నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరి పదేండ్లు పూర్తయింది. నా భర్త (పోలీస్ కిష్టయ్య) మా నుంచి దూరమై 15 ఏండ్లు గడిచిపోయినాయి. ఆనాడు చిన్న పిల్లలను పట్టుకొని తండ్రిలాంటి కేసీఆర్ సార్ దగ్గరకు వచ్చాను. 'మీ కుటుంబానికి నేనున్నాను' అని ఆనాడు కేసీఆర్ మాట ఇచ్చారు. 'నువ్వు బాధపడకమ్మా. పిల్లలను నేను చూసుకుంటా' అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం నా పిల్లలకు, నా కుటుంబానికీ అన్ని విధాలా అండగా ఉన్నారు. నా బిడ్డ మెడికల్ కాలేజీలో చదువుకు డబ్బులు ఇస్తున్నారు. 6వ తరగతి నుంచి ఇప్పటి వరకు అన్ని విధాలా ఆసరా అందిస్తున్నారు' అని కానిస్టేబుల్ కిష్టయ్య భార్య పేర్కొన్నారు.

### కంటికి రెప్పలా చూసుకుంటున్నరు

'మేము 6వ తరగతిలో ఉన్నప్పుడు మా నాన్న తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేశారు. మాకు ఊహ తెల్వని సమయంలోనే నాన్న చనిపోయారు. మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ఆనాడు ఇచ్చిన మాటను కేసీఆర్ సార్ నిలబెట్టుకుంటూనే ఉన్నారు. చెల్లిని మెడిసిన్ చదివించారు. ఇవాళ పీజీ కోసం మళ్లీ డబ్బులు ఇచ్చారు. మా కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉండి, కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. మా నాన్న కల నెరవేరింది. కానీ, మా మధ్య మా నాన్న లేకపోవడం బాధగా ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తి కావడం సంతోషంగా ఉన్నది. మా నాన్న ఉంటే ఎంతో సంతోషించేవాడు' అని కిష్టయ్య కొడుకు రాహుల్ పేర్కొన్నారు.

అమరుల ఫొటోలతో నిరసన తెలుపుతున్న కుటుంబ సభ్యులు

# అమరులకుటుంబాలకు అవమానం

- రాష్ట్రావతరణ వేడుకల్లో పట్టించుకోని సర్కారు?
- అమరుల పేర్లను తలచుకోక పోవడమూ దారుణం
- పిలిచి అవమానిస్తారా అంటూ కుటుంబాల ఆవేదన
- అమరుల చిత్రపటాలతో సభాప్రాంగణంలో నిరసన
- గుర్తించనేలేదని కన్నీటి పర్యంతమైన అమరుల తల్లులు

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): పదేండ్ల పండుగ పేరిట రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివారం నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో అమరవీరుల కుటుంబాలకు తీవ్ర అన్యాయం జరిగింది. వేడుకల్లో పాల్గొనాల్సిందిగా అమరులను కుటుంబాలను ఆహ్వానించిన ప్రభుత్వం ఉత్సవాల్లో కనీసం వారిని పట్టించుకోనేలేదు. తమకు కనీస గుర్తింపే లేకపాయే అని కొందరు అమరుల తల్లులు, వారి కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. అన్యాయంపై సభా ప్రాంగణంలోనే గళమెత్తారు. తమను పట్టించుకోరా అంటూ నిలదీశారు. అమరుల చిత్రపటాలతో తీవ్ర నిరసన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కనీసం అమరుల పేర్లను కూడా తలచుకోలలేదని, తమను పలుకరించలేదని ఆవేదనను వ్యక్తం చేశారు. తమను గుర్తిస్తారని, సన్మానిస్తారని ఆశించి వచ్చామని తెలిపారు. ఇక్కడికి ఎందుకు పిలిచారో అర్థమే కావడమే లేదని అంజమ్మ అనే అమరవీరుని కుటుంబ సభ్యురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడికొచ్చిన జనాన్ని చూసేందుకా తాము వచ్చిందని ప్రశ్నించారు. కనీసం అమరుల తల్లిదండ్రులను సన్మానం కూడా చేయలేదంటూ పలువురు అసంతృప్తిని వ్యక్తంచేశారు.

### అమరుల త్యాగాలకు గుర్తింపు ఏది?

మాది సంగారెడ్డి జిల్లా జోగిపేట. నా తమ్ముడు కేపీ రవీందర్ రాజు (పిట్ల రాజు) ఓయూలో చదువుకునేవాడు. బతుకమ్మ పండుగకు ఊరికొచ్చి, సకలజనుల సమ్మె సమయంలో ఎమ్మార్వో ఆఫీసు ముందు ధర్నాలో పాల్గొని, పెట్రోల్ పోసుకుని కాల్చుకుని అమరుడయ్యాడు. కేసీఆర్ ప్రభుత్వం మాకు రూ.10 లక్షలు, ప్రభుత్వ ఉద్యోగాన్నిచ్చింది. ఇప్పుడు తెలంగాణ అమరవీరులకు గుర్తింపేలేకుండా పోయింది. కాలనీలకు అమరుల పేర్లు, విగ్రహాలు, చిత్రపటాల ఏర్పాటుకు ముందుకు రావాలి.

- అనిల్‌కుమార్, జోగిపేట, సంగారెడ్డి జిల్లా

### ఇంటి స్థలం, పింఛన్ ఏది?

మాది నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలం పెద్దగట్టు గ్రామం. మా తమ్ముడు రమావత్ నరేశ్ 2010 జనవరి 15న అమరుడయ్యాడు. నాగార్జునసాగర్ ధూంధాంలో పాల్గొని కిరోసిన్ పోసుకుని కాల్చుకుని అమరత్వం పొందాడు. మా కుటుంబానికి 2015లో 10 లక్షల ఎక్స్‌గ్రేషియా, 2016లో ఉద్యోగమిచ్చారు. అమరుల కుటుంబాలకు స్వాతంత్ర్య సమరయోధులతో సమానంగా పింఛన్ ఇస్తమన్నరు. 200 గజాల స్థలం ఇస్తమన్నరు. అందరికీ ఒకే చోట స్థూపం కట్టిస్తామన్నరు. ఇంతవరకూ జరగలేదు.

- రమావత్ కృష్ణ, పెద్దగట్టు, నల్లగొండ జిల్లా

### ఇండ్ల స్థలాలు, పింఛన్లు ఇవ్వడం లేదు

మాది నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి. మా తమ్ముడు చలమల్ల శివరాం 2012 నవంబర్ 11న అమరుడయ్యాడు. అన్ని జిల్లాల నుంచి అమరుల కుటుంబాలకు చెందినవాళ్లమంతా రాష్ట్రావతరణ వేడుకలకు వచ్చినం. అమరుల కుటుంబాలు ఇంకా దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నాయి. ప్రభుత్వం ఇంకా ఆదుకోవాల్సి ఉన్నది. ఇండ్ల స్థలాలు, పింఛన్లు ఇంతవరకు ఇవ్వడం లేదు. నెరవేర్చాల్సిన హామీలు ఇంకా ఉన్నాయి. వాటిని నెరవేర్చాలని కోరుతున్నాం.

- చలమల్ల స్వాతి, నార్కట్‌పల్లి, నల్లగొండ జిల్లా

### ఉద్యమకారులను విస్మరించారు

మాది నల్లగొండ జిల్లా దేవరకొండ. 1969 తొలి దశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న. పదో తరగతిలో ఉన్నప్పుడే పోరాటం చేసిన. ఎస్ఐ మోహన్‌రాజు నన్ను విపరీతంగా కొట్టిండు. రెండుసార్లు 40 రోజుల చొప్పున 80 రోజులపాటు జైలుశిక్షను అనుభవించా. మా వివరాల కోసం పోతే పోలీస్‌స్టేషన్లో, జైలులో రికార్డులు లేవంటున్నరు. మమ్మల్ని తెలంగాణ సమరయోధులుగా గర్తించి సర్టిఫికెట్లు ఇవ్వాలి. మాకు బస్‌పాస్, హెల్త్‌కార్డు ఇవ్వాలి. పింఛన్లు మంజూరు చేయాలి.

- దుర్గరాజు, దేవరకొండ, నల్లగొండ జిల్లా

# రేవంత్‌రెడ్డి జాక్‌పాట్ సీఎం

పరిణతి, పరిపక్వత లేని ముఖ్యమంత్రి

- తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఒక్కరోజుకే పరిమితం చేసిన మూర్ఖుడు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు
- తెలంగాణభవన్‌లో ఘనంగా దశాబ్ది వేడుక • జాతీయ, పార్టీ జెండాల ఆవిష్కరణ

తెలంగాణభవన్‌లో జాతీయజెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపీ సురేశ్ రెడ్డి, ఎమ్మెల్సీ దండె విఠల్, నేతలు నారదాసు, రసమయి, పొన్నాల

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి జాక్‌పాట్ సీఎం అని ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతున్నదని, అవగాహన, పరిణతి, పరిపక్వత లేని తెలివితక్కువ ముఖ్యమంత్రి అని, తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను కూడా ఒక్కరోజుకే పరిమితం చేసిన మూర్ఖుడని, తెలంగాణ గురించి, తెలంగాణ ఏర్పాటు వెనక ఉన్న త్యాగాల గురించి ఆయనకు తెలియదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్‌కు చెందిన ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ భఘేల్ గతంలో మూడు రోజుల పాటు ఆ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహించారని గుర్తు చేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆదివారం జాతీయ జెండా, బీఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ తాము అధికారంలో ఉండి ఉంటే రాష్ట్ర అవతరణ దినోత్సవాలను నెలపాటు ఘనంగా నిర్వహించేవారమని చెప్పారు. తెలంగాణ అవతరణ, కేసీఆర్ గురించి మాట్లాడే అర్హత రేవంత్ రెడ్డికి లేదని, ఆయనకు ప్రజలు బుద్ధిచెప్పే రోజులు త్వరలోనే వస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ అవతరించి పదేండ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ తరపున, 60 లక్షల పార్టీ కార్యకర్తల తరపున తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సాధన కోసం అనేక త్యాగాలు, చివరికి ప్రాణాలర్పించిన అమరులందరికీ వందనాలు సమర్పించారు. 2001లో మలిదశ ఉద్యమంతో కొత్త విప్లవాన్ని సృష్టించి, చరిత్రను మలుపు తిప్పి, తెలంగాణ రాష్ట్ర సమితి అనే పార్టీని ఏర్పాటు చేసి, తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చింది కేసీఆర్ అని గుర్తుచేశారు. ఏర్పాటు కోసమైతే ప్రాణత్యాగాలు జరిగాయో అవన్నీ ఫలించి దశాబ్దకాలంలోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అద్భుతమైన ప్రగతి సాధించిందని చెప్పారు. తెలంగాణ ఆచరిస్తది.. దేశం అనుసరిస్తది అన్న తీరుగా దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. ఉద్యమంలో సహకరించిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, న్యాయవాదులు, జర్నలిస్టులు, యువకులు, సబ్బండవర్గాలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలని, దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

### ఉద్యమ విశేషాలు, బీఆర్ఎస్ ప్రభుత్వ కార్యక్రమాల నెమరేత..

తెలంగాణభవన్‌లో రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం ఫొటో ఎగ్జిబిషన్‌ను అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య భార్య సరస్వతి చేత కేటీఆర్ ప్రారంభింపజేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఫొటోలను తిలకించి ఉద్యమ ఘట్టాలు, బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను నెమరేసుకున్నారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర తొలిముఖ్యమంత్రి కేసీఆర్ పూలమాల వేశారు. వేదికపై ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. సమావేశంలో ఉద్యమ కాలం నాటి విశేషాలను వివరించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. కార్యక్రమానికి ముందు రసమయి ఇతర గాయకులు తెలంగాణ ఉద్యమ గీతాలు పాడుతూ ఉత్సాహం నింపారు.

### నేడు ముగింపు వేడుకలు

ఉత్సవాల ముగింపులో భాగంగా నేడు అన్ని జిల్లాల బీఆర్ఎస్ కార్యాలయల వద్ద జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. దవాఖానలు, అనాథాశ్రమాల్లో పండ్లు, మిఠాయిలు పంపిణీ చేయనున్నారు.

**దశాబ్దాల** స్వరాష్ట్ర కలను సాకారం చేసుకొని..
దశాబ్దం గడిచిన సందర్భమిది!
ఆధునిక భారతం కళ్లరా చూసిన..
మరో స్వాతంత్ర్య పోరాటం మన తెలంగాణ ఉద్యమం!
బక్కపలచని, ఉక్కు సంకల్పం కలిగిన..
కేసీఆర్ పోరాట ఫలితమిది!
అమరవీరుల ప్రాణత్యాగాల పునాదులపై..
ఏర్పడిన కొత్త రాష్ట్రం మనది!
సబ్బండ వర్గాలు కొట్లాడి, పోట్లాడి..
మారాష్ట్రం మాకంటూ సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రమిది!
60 ఏళ్ల విధ్వంస గాయాలను..
పదేళ్ల వికాసంతో మాన్పేసుకున్న ఘనకీర్తి మన తెలంగాణది!
పాలన చేతకాదంటూ నొసటితో వెక్కిరించిన వాళ్లే..
మనసునిండా ప్రశంసించిన దశాబ్దమిది!
తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తుందనేలా..
అనితర సాధ్యంగా సాగింది ఈ దశాబ్ద ప్రయాణం!
శతాబ్దంలో సాధ్యంకాని అద్భుతాలు..
దశాబ్దంలో చేసి చూపింది మన తెలంగాణ!
నాడు కరవు, రాళ్లురప్పల, కల్లోలిత తెలంగాణ..
నేడు పచ్చని, సుభిక్షమైన కోటి రతనాల వీణ నా తెలంగాణ!
అదే స్ఫూర్తి, అదే సంకల్పం ఇకముందు ఉండాలని..
తెలంగాణ దేశానికి దిక్సూచిగా కొనసాగాలని..
కాంక్షిస్తూ.. ఆకాంక్షిస్తూ.
ప్రతి ఒక్కరికీ తెలంగాణ దశాబ్ది ఉత్సవ శుభాకాంక్షలు
జై తెలంగాణ...జైజై తెలంగాణ

- కేటీఆర్

### మరో స్వాతంత్ర్య పోరాటం..

నిబద్ధతతో పోరాడి గమ్యాన్ని ముద్దాడిన ఒకే ఒక్కడు కేసీఆర్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కేసీఆర్ పోరాట పరిమను ఎక్స్ వేదికగా ఆదివారం గుర్తుచేశారు. 'స్వాతంత్ర్యం ఇవ్వలేదు.. తీసుకోబడింది' అని నేతాజీ సుభాష్ చంద్రబోస్ చెప్పిన మాటలను ఉటంకిస్తూ, తెలంగాణ ఎవరి దయా దాక్షిణ్యాలతోనో ఏర్పాటైంది కాదని, పోరాడి సాధించుకున్నదని స్పష్టంచేశారు. 'బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 2001లో నిర్వహించిన పార్టీ తొట్టతొలి సభలోనే ఢిల్లీ మెడలువంచి తెలంగాణ సాధిస్తామని ప్రకటించారంటే ఎంత ధైర్యం కావాలి! ఉద్యమబాట వీడితే రాళ్లతో కొట్టి చంపండి అని పిలుపునివ్వాలంటే పుట్టిన మట్టిపై ఎంత ప్రేమ ఉండాలి! అసాధ్యమనుకునే ఒక స్వప్నాన్ని సుసాధ్యం చేసి చూపిస్తామని చెప్పిన మాట ఆయన ఉక్కు సంకల్పానికి నిదర్శనం! నడి మధ్యలో కాడిపారేసి పారిపోయిన ఉత్తుత్తి ఉద్యమకారులు, నకిలీ నాయకులు ఎందరో! పట్టుదలతో, నిబద్ధతతో పోరాడి గమ్యాన్ని ముద్దాడిన ఒకే ఒక్కడు కేసీఆర్!' అని గుర్తుచేశారు.

- తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర అవతరణ వేడుకలు

తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకల సందర్భంగా హైకోర్టులో జాతీయ జెండా ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే

బోయినపల్లి తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యమకారుడు మూల్యా సంజీవ్

### నన్ను పిలువరా?

కంటోన్మెంట్/బొల్లారం. జూన్ 2: తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపును ఇచ్చి, సరైన న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల హక్కుల ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మూల్యా సంజీవ్ డిమాండ్ చేశారు. పరేడ్ మైదానంలో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో కవులు, కళాకారులు, ఉద్యమకారులను సన్మానించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తాను కనిపించలేదా? అని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆదివారం బోయిన్‌పల్లి తెలంగాణ తల్లి విగ్రహం ముందు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. ఉద్యమకారులను గౌరవించాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్నదని గుర్తు చేశారు.

# ఉద్యమకారులను అనుమతించలే

- ఆహ్వానాలున్నా అనుమతి నిరాకరణ
- ట్యాంక్‌బండ్ వేడుకల్లో నిరసన
- పద్మశ్రీ అవార్డు గ్రహీత సమ్మయ్య పట్ల సర్కారు నిర్లక్ష్యం

ట్యాంక్‌బండ్ వద్ద ఆందోళన చేపడుతున్న ఉద్యమకారులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య సైతం బయట నిలబడాల్సిన పరిస్థితి

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ)/కవాడిగూడ: పదేండ్ల పండుగ పేరిట కాంగ్రెస్ సర్కారు ఆదివారం నిర్వహించిన రాష్ట్రావతరణ వేడుకల్లో ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం జరిగింది. ఆహ్వాన పత్రికలను తీసుకొని వచ్చినవారిని లోపలికి అనుమతించకుండా అవమానించారు. మరెందరో ఉద్యమ నేతలను ఉత్సవాలకు పిలువకుండా నిర్లక్ష్యం ప్రదర్శించింది. రాత్రిట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన పలువురు ప్రముఖులు, ఉద్యమకారులను వేదిక వద్దకు అనుమతించనేలేదు. యక్షగాన కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య ట్యాంక్‌బండ్‌పై అనామకుడిగా అందరితో కలిసి వేడుకలను వీక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమను పిలిచి అవమానించిందని ఉద్యమకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వేదిక వద్ద నిరసన తెలిపారు. ఆహ్వానపత్రాన్ని చూపినా లోపలికి అనుమతించలేదని వారు మండిపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఉద్యమకారులకు నచ్చజెప్పి లోపలికి పంపించారు.

### ఆహ్వానపత్రికలతో ట్యాంక్‌బండ్‌పై నిరసన

తెలంగాణ ఉద్యమంలో ఎన్నో నిర్బంధాలను అనుభవించిన తమ త్యాగాలకు గుర్తింపు ఇదేనా అంటూ పలువురు ఉద్యమకారులు మండిపడుతున్నారు. ఆహ్వాన పత్రికలను ప్రదర్శిస్తూ పలువురు ట్యాంక్‌బండ్‌పై నిలబడి నిరసన తెలిపారు. ఆహ్వాన పత్రికలు ఉండి ట్యాంక్‌బండ్‌పైకి అనుమతిలేని వారు కొందరైతే, ఆహ్వాన పత్రికలనే పంపకుండా అవమానించిన తొలి, మలిదశ ఉద్యమకారులు భారీ సంఖ్యలో ఉన్నట్టు సమాచారం. అందరినీ ఆహ్వానించామంటూ చెప్పిన టీఎస్‌జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం, సీఎం రేవంత్‌రెడ్డి మాటలు వట్టివేననీ దీంతో తేటతెల్లమైంది. ఉద్యమ సమయంలో పోలీసుల లాఠీలు, అక్రమ కేసులతో వేధింపులకు గురైతే, ఇప్పుడు అధికారిక ఆహ్వాన పత్రికలు ఉండి కూడా అనుమతించక పోవడమేంటని ఆందోళన వ్యక్తం చేశారు.

### తొలి తరం ఉద్యమకారుడికి పిలుపేది?

తెలంగాణ రాష్ట్ర సాధన అంతిమ ధ్యేయంగా తొలితరం ఉద్యమం నుంచి స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన సంగంరెడ్డి (ముచ్చర్ల) సత్యనారాయణ కుటుంబానికి ఊహించని అవమాన మే జరిగింది. 1953లోనే నాన్ ముల్కీ గో బ్యాక్ అంటూ గొంతెత్తి, 1969లో కాసు బ్రహ్మానందరెడ్డి దురాగాతాలను ఎండగట్టిన గొప్ప పోరాట యోధుడు సత్యనారాయణ. 1983లోనే రాజకీయ కురువృద్ధుడైన హయగ్రీవచారిని ఓడించి చరిత్రలో చెరిగిపోని ముద్ర వేసుకున్నారు. కవిగా, తొలితరం వాగ్గేయకారుడిగా, రచయితగా, వక్తగా ప్రొఫెసర్ జయశంకర్ సన్నిహితుడిగా ఉంటూ వచ్చిన ముచ్చర్ల ఉద్యమానికి ఊపిరిలూదారు. అలాంటి ఉద్యమ చరిత్ర ఉన్న ముచ్చర్ల కుటుంబాన్ని కూడా దశాబ్ది ఉత్సవాలకు పిలువకుండా అవమానించింది.

### 'ఎవరి పాలయ్యిందిరో తెలంగాణ': పృథ్వీరాజ్

నిజమైన తెలంగాణ ఉద్యమకారులకు సరైన గుర్తింపే లేదని క్రాంతిదళ్ అధ్యక్షుడు, ముచ్చర్ల కుటుంబానికి చెందిన పృథ్వీరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇవాళ ప్రభుత్వం వ్యవహరించిన తీరు చూస్తే 'ఎవరి పాలయ్యిందిరో తెలంగాణ' అనే మాటను గుర్తుకు తెస్తున్నాయని చెప్పారు. స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా బతికిన ఎంతో మంది తాము ఉద్యమకారులమని చెప్పుకోవాల్సిన దౌర్భాగ్యాన్ని ప్రభుత్వం తెచ్చిందని తెలిపారు. ప్రభుత్వం ఆహ్వానించనంత మాత్రాన తమ ఉద్యమ ఆనవాళ్లు చెరిగిపోవని స్పష్టం చేశారు.


అమూల్ పాల ధరలలో మార్పు వచ్చింది

| ఉత్పాదన | ఎస్‌కెయు | ప్రస్తుత ఎంఆర్‌పి*(₹) | కొత్త ఎంఆర్‌పి*(₹) |
|---|---|---|---|
| అమూల్ గోల్డ్ | 500 mL | 34 | 35 |
| అమూల్ తాజా | 500 mL | 27 | 28 |
| | 1L | 54 | 56 |
| సాగర్ స్మిల్క్ పాలు | 500 mL | 20 | మార్పు లేదు |
| | 1L | 40 | మార్పు లేదు |
| అమూల్ గేదె పాలు | 500 mL | 37 | 39 |
| | 1L | 74 | 77 |

*ఎంఆర్‌పి (అన్ని పన్నులూ కలుపుకుని). ధరలకులు వర్తిస్తాయి.

ఈ కొత్త ధరలు హైదరాబాద్ మరియు దగ్గరలో ఉన్న మార్కెట్లలో 3 జూన్, 2024 ఉదయం నుండి వర్తిస్తాయి.

అమూల్ పాలు

Amul The Taste of India

పెరుగుతున్న ఇన్‌పుట్ ఖర్చుల కారణంగా మేము పాల ధరలని పెంచాము. అధిక సమాచారానికై, దయచేసి మమ్మల్ని ఇక్కడ సంప్రదించండి: హైదరాబాద్: 8328090488పై.